# కూలీల ట్రాలీ బోల్తా.. 15 మందికి గాయాలు




www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 26 | మార్చి | 2025
పేజీలు 8

# బోసిపోనున్న బొగ్గుట్ట

**-ఉగాదితో మూతబడనున్న జవహర్ ఖని 5..!?**
**-ఇతర ప్రాంతాలకు కార్మికులు**



**ప్రజాపక్షం/ఇల్లందు:** సింగరేణి పుట్టినిల్లయిన ఇల్లందు నేడు జవహర్ ఖని5(జేకే5) ఉపరితల గని మూసివేతతో వెలవెల బోనుంది. 1876లో బ్రిటీష్ శాస్త్రవేత్త విలియం కింగ్ ఇల్లందులో బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని కనుగొన్నారు. బ్రిటీష్‌వారు భారతదేశంలో మొట్టమొదటి సారిగా ఇల్లందులో మూడు భూగర్భ బొగ్గు గనులను ఏర్పాటు చేసి వ్యాపారం కొనసాగించారు. స్వాతంత్రం అనంతరం ఇల్లందులో జేకే1, జేకే2, జేకే3, జేకే5, 29డిప్, పోలంపల్లి, సటోఫిట్, సెంచరింగ్ క్లైన్, 21ఇంక్లైన్, 20పిట్, 24ఇంక్లైన్ పదికి పైగా బొగ్గుబావులతో 15వేల మందికి పైగా సింగరేణి కార్మికులతో ఇల్లందు కళకళలాడేది. నేడు ఇల్లందులో ఒక్కొక్కటిగా భూగర్భ గనులు మూతబడుతూ చివరిగా జేకే5 ఓసీ మాత్రమే మిగిలింది. అదికూడా ఉగాదికి మూతబడనున్నటంతో సింగరేణి కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది. జేకే5 ఉపరితలగని మూతబడితే కార్మికులను కోయగూడెం, సత్తుపల్లి, కొత్తగూడెం ఏరియాలకు బదిలీ చేస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. జేకే5 ఉపరితలగని విస్తరణలో భాగంగా 21ఇంక్లైన్, 24ఏరియా, పూసపల్లి ప్రాంతాలను కలుపుకుని జేకే 5 ఓసీ విస్తరణ ద్వారా ఇల్లందు మనుగడ మరో 13సంవత్సరాల వరకు ఉంటుందని అందరూ భావిస్తున్నారు. సింగరేణి యాజమాన్యం దీనిపై పూర్తిస్థాయిలో బాధ్యతను చేపట్టిన దానికి సంబంధిత అటవీ, పర్యావరణ అనుమతులు పూర్తిస్థాయిలో రాకపోవడం, ఇప్పటికే అక్కడ నివాసముంటున్న నిర్వాసితులకు ఎటువంటి ఆర్‌ఆర్ ప్యాకేజీ ప్రకటించకపోవడంతో జేకే5 ఓసీ విస్తరణకు ఇంకా ఆరు మాసాలు సమయం పట్టవచ్చని కార్మికులు భావిస్తున్నారు. ఇల్లందు జేకే5 ఓసీని నమ్ముకొని సింగరేణి ఉద్యోగులు 220మంది కార్మికులు, 123మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానంలో శానిటేషన్, సివిల్, ప్రైవేటు సెక్యూరిటీలుగా పనులు చేస్తున్నారు. ఒక వేళ జేకే5ఓసీ మూతబడితే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారనుంది. సింగరేణి ఉద్యోగులను 30 నుంచి 50మంది వరకు ఇతర ఏరియాలకు బదిలీ చేసే అవకాశం ఉండటంతో పర్మినెంట్ ఉద్యోగులే సర్దుబాటు లేక బదిలీ చేస్తుండటంతో కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. తమను తీసివేస్తే కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. జేకే5ఓసీ ఉగాదికి గనుక మూతబడితే పర్మినెంట్,

మిగతా 2లో..

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్






**-ముగ్గురు మావోయిస్టులు హతం**
**-ఒకరిపై 25లక్షల రివార్డు**
**-నిర్ధారించిన పోలీసులు**

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో మంగళవారం ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. భద్రతా బలగాలు మావోయిస్టుల నడుమ హోరాహోరీగా 8 గం.పాటు సాగిన ఈ ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతం మయ్యారు. మృతి చెందిన మావోయిస్టుల్లోని ఒకరిపై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్లు ఆ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు ప్రకటించారు. గీడం పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్సాపర, నెల్లోడ, బోడ్గా, ఇకేలి గ్రామాల

మిగతా 2లో..

# ఖమ్మం కార్పోరేషన్ బడ్జెట్ రూ.188.31 కోట్లు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థకు సంబంధించి 2025  26 ఆర్థిక సంవత్సరానికి రూ.188.31 కోట్లతో బడ్జెట్ ఆమోదం పొందినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన నిర్వహించిన ఖమ్మం కార్పోరేషన్ కౌన్సిల్ సమావేశంలో

మిగతా 2లో..

**-ఐదు జోన్లుగా విభజన**
**-పన్నుల రీ అసెస్మెంట్ సర్వే నిర్వహణ**
**- ప్లాస్టిక్ రహిత ఖమ్మంగా తీర్చిదిద్దాలి**
**-ఖమ్మం కార్పోరేషన్ బడ్జెట్ సమావేశంలో కలెక్టర్**

# బోసిపోనున్న బొగ్గుట్ట

(మొదటిపేజీ తరువాయి)

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కాక పరోక్షంగా వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తులు, వాణిజ్య సముదాయాలు పూర్తిస్థాయిలో నష్టపోవాల్సి వస్తుంది. ఆర్థికంగా మరింత నష్టాన్ని ప్రజలు చూడక తప్పదని రాజకీయ పార్టీలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ సింగరేణి కార్మికులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి విధులు నిర్వర్తిస్తే ఇల్లందు పూసపల్లి ఓసీ ప్రారంభమవుతే మళ్లీ ఇల్లందుకు చేరడం కష్టంతో కూడిన పనని కార్మికులు భావిస్తున్నారు. అందరూ పదవీవిరమణకకు దగ్గరగా ఉండటం, వయసుమీద పడి ఉండటంతో ఇతర ఏరియాలో విధులు నిర్వహించడం కష్టంతో కూడిన పని. జేకే5 ఓసీ విస్తరణలో భాగంగా పూసపల్లి ఓసీని వెంటనే ప్రారంభిస్తే ఇల్లందుకు మనుగడ ఉంటుందని కార్మికులను ఇతరప్రాంతాలకు బదిలీ చేయాల్సిన అవసరం ఉండదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### పూసపల్లి ఓసీని వెంటనే ప్రారంభించాలి: కె.సారయ్య, ఎఐటీయూసీ కేంద్ర కమిటీ డిప్యూటి జనరల్ సెక్రటరీ



జేకే5 ఓసీ విస్తరణలో భాగంగా పూసపల్లి ఓసీని వెంటనే ప్రారంభిస్తే కార్మికులను సర్ధుబాటు చేయవచ్చు. నిర్వాసితులకు మెరుగైన ఆర్‌ఆర్ ప్యాకేజీ ప్రకటించి ఓబీ, ఓసీని సింగరేణి సంస్థ ద్వారానే చేపట్టితే సింగరేణికి భవిష్యత్తు ఉంటుంది. సింగరేణి కార్మికులను బదిలీ చేయకుండా ఓసీని కొనసాగించాలి.

### సింగరేణి సంస్థ పునరాలోచించాలి: మడత రమా వెంకట్‌గౌడ్, ఇల్లందు మాజీ మున్సిపల్ ఛైర్మన్



జేకే5 ఓసీ మూసివేతపై సింగరేణి యాజమాన్యం పుకరాలోచించాలి, ఒకవేళ ఓసీ మూతబడితే ఇల్లందుకు భవిష్యత్ ఉండదు. బతుకుతెరువు కోసం ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుంది. ఇల్లందు చీకటిమయం అవుతుంది. సింగరేణి డీఎంఎఫ్‌టీ నిధులతో ఇల్లందు అభివృద్ధి చెందుతుంది. ఒకవేళ జేకే5 ఓసీ మూతబడితే ఇల్లందు అభివృద్ధి కుంటు పడే ప్రమాదం ఉంది.

### ఓసీ కాలపరిమితి పెంచాలి: ఆలేటి కిరణ్, సీపీఎం మండల కార్యదర్శి



జేకే5 ఓసీ కాలపరిమితిని పెంచి, వెంటనే పూసపల్లి ఓసీని ప్రారంభించి సింగరేణి కార్మికులు ఇక్కడే ఉండే విధంగా చూడాలి. కార్మికులను ఇతర ఏరియాలకు బదిలీ చేస్తే రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న కార్మికులు ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటారు. సింగరేణిపై పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల భవిష్యత్తు ఆగమ్యగోచరమవుతుంది.

## కూలీల ట్రాలీ బోల్తా.. 15 మందికి గాయాలు



ప్రజాపక్షం/జూలూరుపాడుః జూలూరుపాడు మండల పరిధిలోని బేతాళ పాడు పెద్దవాగుపై బ్రిడ్జి వద్ద మంగళవారం ఉదయం జరిగిన ప్రమాదంలో కూలీలతో వెళుతున్న ట్రాలీ టైర్ పగిలి వాగులోకి దూసుకు వెళ్ళింది. ఈ ప్రమాదంలో సు మారు 15 మంది వరకు గాయాల పాలయ్యారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ప్రమాద స్థలం వద్ద చేరుకొని క్షతగాత్రులను కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాగులో పడ్డ ట్రాలీని ట్రాక్టర్ సహాయంతో బయటకు తీయించారు. ప్రమాద సమయంలో ట్రాలీలో సుమారు 25 నుంచి 30 మంది కూలీల వరకు ఉన్నట్లు తెలుస్తోంది. టైర్ పగిలిపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. కూలీలంతా బేతాళ పాడు గ్రామం పరిసర ప్రాంతాల వారు.

### వాహనదారులకు ప్రమాదంగా మారిన బ్రిడ్జి

పెద్ద వాగు పై ఏర్పాటు చేసిన ఈ బ్రిడ్జి ప్రమాద గంటికలను మోగిస్తోంది. గతంలో ఈ బ్రిడ్జి పైనుంచి వాహనాలు పడి ప్రమాదాలు జరిగినప్పటికీ బ్రిడ్జికు సంబంధించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. బ్రిడ్జిపై రెండు వైపులా ఎలాంటి జాగ్రత్తలు లేవు మరియు బ్రిడ్జ్ మూలమలుపు కావడం దిగువ భాగంలో ఉండటం వల్ల తరచు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రాత్రి సమయాలలో ఈ ప్రమాదాలు మరింత ఎక్కువ అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికైనా బ్రిడ్జ్‌కి రెండు వైపులా గోడను ఏర్పాటు చేయాలని, బ్రిడ్జి ఎత్తును పెంచాలని, బ్రిడ్జి వద్ద విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

నడుమ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే పక్కా సమాచారం మేరకు డిఆర్‌జి, బస్తర్ ఫైటర్స్‌కు చెందిన పోలీస్ బలగాలు ఈ ఎదురుకాల్పుల్లో పాల్గొన్నాయి. ఘటనా స్థలం నుండి ఇన్సాస్ రైఫిల్ శ్రీ, 303రైఫిల్, పేలుడు పదార్ధాలు,రోజువారీ ఉపయోగించే వస్తువులు , వంట సామాగ్రిని స్వాదీనం చేసుకున్నారు. ఎదురు కాల్పుల్లో మృతి చెందిన ముగ్గురు మావోయిస్టుల్లో ఒకరైన సుధీర్ అలియాస్ సుధాకర్ అలియాస్ మురళీది తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈయన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడని, ఇతని తలపై 25 లక్షల రివార్డు ఉందని పోలీస్ అధికారులు వెల్లడించారు. మరో ఇద్దర్ని ఇంకా గుర్తించాల్సి ఉంది. ఇదిలా ఉండగా సంఘటనా ప్రాంత సమీపంలో మావోయిస్టుల కోసం కూంబింగ్ కొనసాగుతోంది. 2026 మార్చి 31 నాటికి దేశాన్ని మావోయిస్టు రహితంగా మారుస్తామని కేంద్ర బిజెపి ప్రకటించిన మాట విధితమే. కాగా మార్చి 20న జరిగిన ఎదురు కాల్పుల్లో ఏకంగా 30 మంది మావోయిస్టులు హతమయ్యారు. తాజా ఎన్ కౌంటర్‌తో ఈ ఏడాది ఇప్పటి వరకు 116 మంది మావోయిస్టులు ఎదురు కాల్పుల్లో మృత్యువాత పడ్డారు.

## ఇళ్ల స్థలాలు, మౌలిక సౌకర్యాలు కల్పించేవరకు వెనకడుగు వేయం

ప్రజాపక్షం/ఇల్లందు: ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు, మౌలిక సౌకర్యాలు కల్పించేవరకు వెనకడుగు వేయమని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఏజె రమేశ్ హెచ్చరించారు. మండలంలోని స్ట్రట్‌ఫిట్ బస్తీ గ్రామపంచాయతీ శివారులో గుడిసెవాసులు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించతలపెట్టిన రిలే నిరాహార ధీక్షలను ప్రారంభించి మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేదలైన గుడిసెవాసులు గత ఆరేళ్లుగా గుడిసెలు వేసుకుని ఉంటున్న వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ ధీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం దిగి రాకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అబ్దుల్ నబీ, మండల నాయకులు తాళ్లూరి





కృష్ణ,మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, మన్నెం మోహన్‌రావు, వజ్జ సురేశ్, వెంకన్న, సంతోష, ససుజాత, కౌసల్య, కాంతమ్మ, రాజు, కమల, రాణి, మమత తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం కార్పోరేషన్ బడ్జెట్ రూ.188.31 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, నగర కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తో కలిసి పాల్గొన్నారు. నగర పాలక సంస్థకు సంబంధించి 2025 26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు, ఆదాయ ఖర్చుల వివరాలు, 2024 25 సంవత్సరానికి సంబంధించి సవరించిన బడ్జెట్ తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. 2025 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.188.31 కోట్లతో బడ్జెట్‌ను ఆమోదించారు. ఇంటి పన్నుల ద్వారా రూ.33.92 కోట్లు, సర్‌చార్జ్ స్టాంప్ డ్యూటీ ద్వారా రూ. 13 కోట్లు, పన్నేతర ఆదాయం ద్వారా రూ. 55.95 కోట్లు ఆదాయం సమకూరుతుందని బడ్జెట్‌లో అంచనా వేయడం జరిగింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ ఛార్జీలు, రుణాల చెల్లింపు, 10 శాతం గ్రీన్ బడ్జెట్ కలుపుకుని చార్జీ వ్యయం క్రింద రూ.65.05 కోట్లు కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగం నిర్వహణ ఖర్చు, సాధారణ పరిపాలన టౌన్ ప్లానింగ్‌కు రూ. 14.12 లక్షల కోట్లు, క్యాపిటల్ ఖర్చుకు రూ. 23.65 కోట్లు కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రణాళికేతర నిధులు, ప్రణాళిక నిధులు, ఇతర గ్రాంట్స్ ద్వారా ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో వచ్చే ఆర్థిక సంవత్సరం రూ. 78.72 కోట్లు, క్యాపిటల్ ప్రాజెక్ట్ ఫండ్ బడ్జెట్ అంచనాలు రూపొందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడ్జెట్ ప్రాథమిక లెక్కలపై లోతుగా చర్చించడం జరిగిందన్నారు. ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ఆస్తి పన్ను, ఇతర పన్నుల రీ అసెస్మెంట్ చేసి ఆదాయ మార్గాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కార్పోరేషన్‌లో గతంలో ఎన్నడులేని విధంగా వరదలు వచ్చిన సమయంలో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పని చేశారని కలెక్టర్ ప్రశంసించారు. వరదలు వచ్చిన ప్రాంతాల్లో ఆస్తి పన్ను సడలింపు సైతం పాలక వర్గం మంచి నిర్ణయం తీసుకుందని కలెక్టర్ తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా కూడా కార్పోరేషన్‌కు ఆదాయం వస్తుందని వాటిని సైతం సరిగ్గా వినియోగించుకునేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నా



మన్నారు. డ్రైనేజీ ప్లాన్‌పై దృష్టి పెట్టాలని, ప్రాథమిక అవసరాలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. పూణే నగరంలో జరుగుతున్న ప్రాక్టిసెస్ ఖమ్మంలో అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం అర్బన్‌కు ఇద్దరు తహసీల్దార్, ముగ్గురు సర్వేయర్లు ఏర్పాటు చేసేవిధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని త్వరలో ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తుందన్నారు. దూరదృష్టితో మాస్టర్ ప్లాన్‌ను తయారు చేస్తున్నామన్నారు. 60 డివిజన్లను ఐదు జోన్లుగా విభజించి పాలన సాగించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. భూ గర్భ జలాలు పెంచేందుకు నిర్మించే ప్రతి భవనంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ రహిత ఖమ్మం నగరంగా రూపుదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఎంఎల్‌సి తాతా మధుసూదన్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో తీగల వంతెన నిర్మాణానికి సంబంధించి పనులు వేగవంతం చేయాలని, స్మశానవాటిక అభివృద్ధికి ఎంపి, ఎంఎల్‌సి నిధులలో భాగంగా నాలుగు కోట్లు కేటాయించాలని మంత్రి ప్రతిపాదనను అందరం ఆమోదించామన్నారు. బడ్జెట్ పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలని ప్రతి డివిజన్‌లో జరిగే అభివృద్ధి పనుల సమాచారం సంబంధిత ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా అందించాలన్నారు.



### విలీన పంచాయతీలపై ప్రత్యేక దృష్టి : మేయర్

విలీన పంచాయతీల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారని మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు విలీన ప్రాంతాలకు బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయించాలని ఆ నిధుల ద్వారా రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. వచ్చే నెల మొదటి వారంలో ప్రజా సమస్యలపై చర్చించేందుకు కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని ఆమె తెలిపారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ కార్పోరేషన్ ఆదాయం పెంచాలనే లక్ష్యంతో ముందుగా 43వ వార్డులో పన్నుల రీ అసెస్మెంట్ చేయడం ద్వారా రూ. 60 లక్షల ఆదాయం పెరిగిందని ఆయన తెలిపారు. 60 డివిజన్లలో రీ అసెస్మెంట్ సర్వే నిర్వహణకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఖమ్మం నగరంలో వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. 60 డివిజన్లను ఐదు జోన్లుగా (నార్త్, సౌత్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్) విభజించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సికిల్ సెల్ అనీమియాపై అవగాహన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జాతీయ సికిల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ మిషన్, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై జిల్లా స్థాయి టిఓటిలకు అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నోడల్ అధికారి డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతిబాయి ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా అనేది వారసత్వంగా వచ్చే జన్యుపరమైన రక్త రుగ్మత అని ఆమె తెలిపారు. ఇది అసాధారణ ఎర్ర రక్తకణాలు, రక్తహీనతకు దారి తీసే జన్యుపరమైన మార్పుల వల్ల వస్తుందని తెలిపారు. సికిల్ సెల్ అనీమియాలో ఎర్ర రక్తకణాలు అసాధారణమైన సి ఆకారపు లేదా సికిల్ ఆకారంలోకి జన్యుపరివర్తన చెందుతాయన్నారు. జిల్లాలో పిహెచ్‌సి వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ల్యాబ్ టెక్నిషియన్ల ద్వారా ఇప్పటి వరకు 87,448 మంది గిరిజనులకు సికిల్ సెల్ స్క్రీనింగ్ నిర్వహించగా వ్యాధి తీవ్రత ఉన్నవారు ఐదుగురు, 274 మంది క్యారియర్లను గుర్తించి వివరాలను సికిల్ సెల్ పోర్టల్‌లో నమోదు చేసి చికిత్సలను అందిస్తున్నామని తెలిపారు. వారికి యుడిఐడి (యునిక్ డిజాబిలిటి ఐడి కార్డు) ఇస్తున్నామన్నారు. తద్వారా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులైన విద్యార్థులకు చదువులలో, ఉద్యోగాల్లో అవకాశాలు కలుగుతాయన్నారు. సికిల్ సెల్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రైనర్లు డాక్టర్ మధువరన్, డాక్టర్ గణేష్ నాయక్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు, పరీక్షలు, చికిత్సల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సైదులు, ప్రోగ్రాం అధికారులు చందునాయక్, రామారావు, ఎస్. సుబ్రహ్మణ్యం, సాంబశివ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మెడికల్ ఆఫీసర్లు, ట్రైబల్ వెల్ఫేర్ టీచర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో రైతులు పండించిన పంటను దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రం కొణిజర్లలో మంగళవారం మొక్కజొన్న కల్లాలవద్దకు వెళ్లి రైతులనుంచి వివరాలు సేకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో ప్రతి పంచాయతీలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నారని తెలిపారు. కాని ప్రస్తుతం అదికారంలోఉన్న ప్రభుత్వం 60 నుంచి 70 శాతం పంటను దళారులకు అమ్ముకున్న తర్వాత తూతూ మంత్రంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. వరిధాన్యానికికూడా రూ 500 బోనస్ ఇస్తామని అన్నారు. పక్కరాష్ట్రాలనుంచి వచ్చిన ధాన్యంతో మనదగ్గర మిల్లుల్లో స్టాకు పేరుకుపోయిందని మన దగ్గర పండించిన రైతులు అమ్ముకోవాలంటే ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వచ్చిందని అన్నారు. నేలకొండపల్లిలో రైతులు పక్కరాష్ట్రాలనుంచి వచ్చే ధాన్యాన్ని ఆపేసి గొడవచేసేవరకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మిర్చిరైతులకు కూడా జెండా పాట ఏదోఒకరేటు పెట్టి మిగిలిన పంట మొత్తం ఏడు, ఎనిమిది వేల రూపాయలకే కొంటున్నారని దీనివలన కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయని రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అన్న సామెతలాగా ఉందని అన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఎక్కువ పంట పండించిన దగ్గర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలవలన రైతులకు మేలు జరుగుతుందని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతు ధర ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. తేమ శాతం పేరుతో కొర్రి పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. నేను ఎవరిని నిందించడంలేదని రైతుల పరిస్థితిని ప్రభుత్వం అర్థంచేసుకొని రైతులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా, వెంకన్న రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్స్‌ను వెంటనే అందిస్తాం

**- తహశీల్దార్ రాంబాబు**



**ప్రజాపక్షం/మధిర :** మధిర మండలంలోని విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్స్‌ను వెంటనే అందిస్తామని మధిర తహశీల్దార్ రాళ్లబండి రాంబాబు తెలిపారు. మండల పరిధిలోని రాయపట్నం పాఠశాలలో మంగళవారం జరిగిన డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన ఏ సర్టిఫికెట్స్ అయినా వెంటనే అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకుని మంచి ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్స్ విషయంలో ఏ దళారుల్ని నమ్మవద్దని, నేరుగా దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్స్ పొందవచ్చునని తెలిపారు. పాఠశాలలో 19మంది విద్యార్థులకు డేట్‌ఆఫ్ బర్త్ సర్టిఫికెట్స్ లేకపోవడంతో ఆధార్ కార్డులు లేవని, ఎస్‌జిటి జల్లా విశ్వనాథం, ఉపాధ్యాయులు మహేంద్ర కుమారి, రాజకుమారి, జనార్ధన్‌రెడ్డి గార్ల సహకారంతో డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్స్ ప్రాసెస్ పూర్తి చేసి పంపిణీ చేయటం జరిగిందని పాఠశాల హెచ్‌ఎం డేవిడ్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ బి.వెంకటేశ్వర్లు, ఎంఇఓ వై.ప్రభాకర్, ఆర్ఐ భానుప్రకాష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



**ప్రజాపక్షం/వైరా :** వైరా మండలం రెబ్బవరం ఉన్నతపాఠశాలలో పొరుగు గ్రామాలనుంచి విద్యనభ్యసించడానికి వస్తున్న తల్లితండ్రిలేని ఏడుగురు అనాథ విద్యార్థులకు సువిధ ఇంటర్నేషనల్ ట్రస్ట్ అమెరికా అనుబంధంగా నడుస్తున్న అష్టగుర్తి గ్రామానికి చెందిన సువిధ వికాస్ ట్రస్ట్ వారిచే మంగళవారం సైకిళ్లు పంపిణీ చేశారు. రెబ్బవరం ఉన్నతపాఠశాల ట్రస్ట్ బాధ్యులు అమరనేని మన్మధరావు, వెంసాని వెంకటి చేతులమీదుగా సైకిళ్లు పంపిణీచేశారు. ఈసందర్భంగా మన్మధరావు మాట్లాడుతు పేదింటి విద్యార్థులు చదువులు సాఫీగా కొనసాగడానికి సువిధ ట్రస్ట్ ఉపకార వేతనాలు ల్యాప్‌ట్యాప్‌లు బీద మహిళలకు కుట్టుమిషన్లు అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండ రైతులకు పనిముట్లు పచ్చదనం పెంచడానికి మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే పదోతరగతి ఫలితాల్లో కూడా ప్రతిభ చూపే విద్యార్థులకు ఒక్కో పాఠశాలనుంచి మొదటి స్థానం సంపాదించిన వారికి ఐదు వేల రూపాయాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మండల విద్యాశాఖాధికారి కొత్తపల్లి వెంకటేశ్వరరావు, అమ్మా ఆదర్శ పాఠశాల చైర్మన్ ఆకుల లలిత, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు గంగవరపు వెంకట్రావు, ఉపాధ్యాయులు కిరణ్, లలిత, భవాని, సూర్యం, శ్రీనివాసులు, నరసింహారావు, దొడ్డవరపు ప్రసాద్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్ ప్రారంభం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నూతనంగా నియమితులైన ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్‌ను రఘునాథపాలెం మండల ఎంఈవో రాములు ప్రారంభించారు. మంగళవారం మండల విద్యా వనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఇటీవల రఘునాథపాలెం మండలానికి నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులు సిహెచ్ కవిత, శ్యామల, అశోక్‌కుమార్‌ల సర్వీస్ రిజిస్టర్‌ను ఎంఈవో రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో పాటు విద్యాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నూతన ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు రఘునాథపాలెం మండల శాఖ తరుపున నూతన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుర్రం కేశవరావు, తుమాటి సైదుబాబు, రాష్ట్ర బాధ్యులు బోడా బాలయ్య, సీనియర్ బాధ్యులు మమత, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ అనురాధ, వెంకటరత్నం, ఆశా, వీరయ్య, చైతన్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సువిధ వికాస్ ట్రస్ట్ చే సైకిళ్ల పంపిణీ



**ప్రజాపక్షం/చింతకాని :** సువిధ వికాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మత్కేపల్లి ఉన్నతపాఠశాలలోని అనాథ విద్యార్థులకు ఎంఈవో వీరనేని శ్రీనివాసరావు, ట్రస్ట్ భా ధ్యులు అమరనేని మన్మధరావు,వేంసాని వెంకటి సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సువిధ వికాస్ ఇంటర్నేషనల్ ట్రస్ట్ అనుబంధంగా అష్ణగుర్తి గ్రామానికి చెందిన సువిధ వికాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక కార్యాక్రమాలు చా లా గొప్పవన్నారు. విద్యార్దులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అమ్మాదర్శ పాఠశాల చైర్మన్ బొల్లికొండ మంగమ్మ, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురా లు అనిత, ఉపాధ్యాయులు నాగమణి, శ్రీనివాసరావు, ఉమా మహేశ్వరరావు, హసీనా తదితరులు పాల్గొన్నారు.

# ఎంపి వద్దిరాజు కృషితో రైల్వే గేటు పునఃప్రారంభం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కృషితో ఖమ్మంలోని రైల్వే గేటును పునః ప్రారంభించారు. ఖమ్మం రైల్వే స్టేషన్‌లో మూ డవ ప్లాట్ ఫాం విస్తరణ పనులు జరుగుతుండడంతో గాంధీచౌక్, కమాన్‌బజార్ మధ్య ఉన్న గేటు మూసివేయడంతో ఆయా ప్రాంతాల్లోని వ్యాపారాలన్ని స్తంభించాయి. గేటు మూసివేయడం వల్ల జరుగుతున్న ఇబ్బందుల గురించి వ్యాపారస్తులు, స్థానికులు ఇటీవల ఎంపి వద్దిరాజు రవిచంద్రను కలిసి వివరించారు. రైల్వే గేటు వల్ల వ్యాపారస్తులు, స్థానికులు పడుతున్న ఇబ్బందుల గురించి ఎంపి వద్దిరాజు రవిచంద్ర పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేకంగా ప్రస్తావించడంతో పాటు రైల్వేశాఖ మంత్రి అశ్వని వైష్ణవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఖమ్మం మధ్యగేటును తొలగించి అక్కడ ఆర్‌వోబి లేదా ఆర్‌యుబిని నిర్మించాలని, అప్పటి వరకు గేటును తెరిపించాల్సిందిగా ఎంపి వద్దిరాజు కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర మంత్రి ఆదేశానుసారం మంగళవారం నుంచి కమాన్‌బజార్, గాంధీచౌక్ ల మధ్య ఉన్న రైల్వేగేటును అధికారులు తెరిచి రాక పోకలను పునరుద్దరించారు. ఆయా ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎంపి వద్దిరాజు రవిచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆశాల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం



**ప్రజాపక్షం/ మధిర :** ఆశా వర్కర్ల తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సోమవారం హైద్రాబాద్‌లోని మెడికల్ అండ్ హెల్త్ కమిషనరేట్ ఎదుట ధర్నాకు వెళ్తున్న ఆశాలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయం అప్రజాస్వామికమని సిఐటియూ మండల కన్వీనర్ పడకంటి మురళీ, వ్య.కా.సం జిల్లా నాయకులు తేలప్రోలు రాధాకృష్ణ, పానినేని రామనర్సయ్య ఖండించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మండల అశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కార్మిక హక్కులను గుర్తు చేస్తూ ఆశా, అంగన్వాడీ టీచర్స్, మధ్యాహ్న భోజన కార్మికులు సంఘటితంగా శాంతియుత నిరసన చేసేందుకు ప్రయత్నిస్తుంటే గత వారంరోజులుగా వారిపై అనేక ఆంక్షలు, నిర్భందాలు విధిస్తున్నారని రాత్రి సమయాల్లో హౌస్ అరెస్టులు చేయటం అప్రజాస్వామికమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశాల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆశాలు పాల్గొన్నారు.

## చలివేంద్రాలను ప్రారంభించిన మట్టా




**ప్రజాపక్షం/ సత్తుపల్లి:** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పాత సెంటర్ ఎస్.బి.ఐ ఏడిబి బ్యాంక్, బస్టాండ్ రింగ్ సెంటర్‌లో ప్రయాణీకులు, పాదాచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నరసింహారావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజాల రాణి, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, ఇమ్మనేని ప్రసాద్ రావు, దొడ్డా శ్రీనివాస్‌రావు, కమల్ పాషా, పింగిలి సామెలు, సత్తుపల్లి పట్టణ మాజీ కౌన్సిలర్స్, సత్తుపల్లి పట్టణ, మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాహనాన్ని తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిదిలోని బేతుపల్లి గ్రామంలో ఓ ఇంటి ముందు పార్క్ చేసిన మహింద్రా థార్ కార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి నిప్పు పెట్టారు. అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు కారులో వచ్చి జీప్ (తార్) పై పెట్రోల్ పోసి నిప్పంటించటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని, చుట్టుపక్కల వారు గమనించి అక్కడికి చేరుకునే లోపే మంటలు అంటించినవారు అక్కడి నుండి పారిపోయారని స్థానికులు తెలిపారు.సెకన్లలో వ్యాపించిన మంటలతో జీప్ పూర్తిగా దగ్ధమైంది.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** బైక్‌పై వెళ్తూ మితిమీరిన వేగంతో చెట్టును ఢీ కొట్టిని లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన సత్తుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన పత్తిపాటి వినోద్ కుమార్ (32) గత కొంతకాలంగా సత్తుపల్లి సింగరేణి బొగ్గు రవాణా లారీ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో పత్తిపాటి వినోద్ కుమార్ చెరుకుపల్లి గ్రామ శివారులో అడవి ప్రాంతంలో మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో.. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## దెందుకూరు వాసికి డాక్టరేట్



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధిలోని దెందుకూరు గ్రామానికి చెందిన ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు, జాషువా సాహిత్య వేదిక ఖమ్మం ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వర్లుకు డాక్టరేట్ వరించింది. కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం నందు ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'డాక్టర్ సీతారాం సాహిత్యం ఒక అధ్యయనం' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎక్సమినేషన్ వారు ప్రకటించారు. పగిడిపల్లి వెంకటేశ్వర్లు కష్టపడి చదువుకుని ఉన్నత ఉద్యోగం పొందిన అంచలంచెలుగా ఎదిగి డాక్టరేట్ అందుకోవటం పట్ల దెందుకూరు గ్రామ ప్రజలు, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు అభినందనలు తెలిపారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణే బిజెపి ధ్యేయం



**ప్రజాపక్షం/ తల్లాడ :** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం ఒకే దేశం ఒకే ఎన్నిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని బిజెపి పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు అన్నారు. తల్లాడ మండల అధ్యక్షులు చల్లా నాగులు ఆధ్వర్యంలో తన ఇంటి వద్ద మంగళవారం ఒకే దేశం ఒకే ఎన్నికపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం ఎన్నికల వల్ల దేశంపై ఆర్థికంగా భారం పడుతోందని, ఒకే దేశం ఒకే ఎన్నిక అనేది కేవలం పరిపాలనా సంస్కరణ మాత్రమే కాదని, భారతదేశ ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని మరింత ప్రభావవంతంగా సజావుగా మార్చే దిశగా మారుతుందని, ఎన్నికల ఖర్చును తగ్గించి ప్రజా ధనం వృధా తగ్గిస్తుందని, తద్వార దేశాభివృద్ధికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నికలను స్వాగతించి మండల, గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని, పార్టీ లకతీతంగా యువకులు, మేధావులను భాగస్వామ్యం చేసి వారి సహకారంతో ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సంగీతం సాయిచంద్, రాయల రమేష్, బాలాజీ నాయక్, వేమారెడ్డి, పులి వెంకటేశ్వర్లు, కటికి నర్సింహారావు, గురునాథం, సామినేని వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# పాఠకులకు అవసరమైన వసతుల కల్పన

**-పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి**
**-జిల్లా గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పాఠకులకు జిల్లా కేంద్రంలో ఉన్న గ్రంథాలయంలో అవసరమైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఉన్న గ్రంథాలయాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తనిఖీ చేశారు. గ్రంథాలయంలో ఉన్న ఆర్వో వాటర్ ప్లాంట్, టాయిలెట్స్, నూతనంగా నిర్మించిన ప్రహరీ గోడను కలెక్టర్ పరిశీలించారు. ఆవరణ మొత్తం చదును చేయాలని, మొక్కలు పెంచాలని అధికారులకు సూచించారు. గ్రంథాలయంలో ఉన్న పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ముచ్చటించారు. ఏ పోటీ పరీక్షకు సన్నద్ధం అవుతున్నారు, ఎటువంటి పుస్తకాలు కావాలో వివరాలు అందిస్తే 10 రోజుల్లో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సంబంధించి ప్రతి ఏడాది అప్‌డేట్ అయిన పుస్తకాలను ఉంచాలని, ఎప్పటికప్పుడు పాతవి మార్చాలని కలెక్టర్ తెలిపారు. పాఠకులు, యువకులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులతో చర్చించి విభాగం వారిగా అవసరమైన పుస్తకాల జాబితాను తయారు చేసి వెంటనే అందించాలని కలెక్టర్ గ్రంథాలయ నిర్వాహకులకు సూచించారు. గ్రంథాలయంలో ఈ లైబ్రరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన కంప్యూటర్లు, హెడ్‌సెట్లు అందిస్తామని, ఇంటర్నేట్ కనెక్షన్ ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. లైబ్రరీలో పాఠకులందరికి 15 రోజుల్లో ఐడి కార్డులను అందించాలని కలెక్టర్ సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించుకున్న తర్వాత ఇతరులకు సాయం చేయాలనే ధృక్పథం ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ కార్యదర్శి అర్జున్, లైబ్రరియన్ లు కె. రవిబాబు, బి. బాబురావు, క్లర్క్ విజయ్‌భాస్కర్, పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 16 మందిని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించండి

**-కార్పోరేషన్ సమావేశంలో బిజి క్లెమెంట్**
**-జనరల్ కౌన్సిల్ ఎజెండాలో పెడతాం**



**ప్రజాపక్షం/ఖమ్మం :** పదేళ్లుగా ఖమ్మం కార్పోరేషన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో వాటర్ సప్లయ్ వర్కర్లుగా పనిచేస్తున్న 16 మంది కెఎంసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని కెఎంసి సమావేశంలో సిపిఐ కార్పొరేటర్ బిజి క్లెమెంట్ డిమాండ్ చేశారు. కెఎంసి బడ్జెట్ సమావేశం మంగళవారం జరిగింది. బడ్జెట్ సమావేశం సందర్భంగా క్లెమెంట్ మాట్లాడుతూ పదేళ్లుగా పనిచేస్తున్న వీరు ప్రస్తుతం ఏ శాఖలో ఎవరి క్రింద పనిచేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. గతంలో కాంట్రాక్టర్ వీరికి వేతనాలు చెల్లించినప్పటికీ రెండేళ్లుగా ఎవరు వీరి బాధ్యతను తీసుకోలేదన్నారు. దానవాయిగూడెం పార్కుతో పాటు వేర్వేరు డివిజన్లలో పంపు ఆపరేటర్లు లీకేజీ వర్కర్లుగా, ఫిల్టర్‌బెడ్ ఆపరేటర్లుగా, ల్యాబ్ అసిస్టెంట్‌లుగా స్వీపర్లుగా వీరి విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. గతేడాది కార్పోరేషన్ సమావేశంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని తా ను తీర్మానం కోసం పట్టుబట్టగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తామని మేయర్‌తో పాటు కమిషనర్ హామీ ఇచ్చారని హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఎందుకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించలేదని క్లెమెం ట్ ప్రశ్నించారు. సకాలంలో వేతనాలు రాక పోయినప్పటికీ వీరు ఇబ్బందులకు గురైనా విధులు నిర్వహిస్తున్నారని క్లెమెంట్ తెలిపారు. క్లెమెంట్ ప్రశ్నకు కమిషనర్ సమాధానమిస్తూ వచ్చే నెల ఐదున జరిగే జనరల్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్‌తో పాటు మేయర్, కమిషనర్ హామీ ఇచ్చారని క్లెమెంట్ తెలిపారు.

## అంబేడ్కర్ స్ఫూర్తితో కుల వివక్షపై ప్రతిఘటిద్దాం




**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్ఫూర్తితో కుల వివక్షపై ఉద్యమించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహన్ పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక బనిగండ్లపాడు ఎస్సీ కాలనీలో సగ్గుర్తి సంజీవ రావు అధ్యక్షతన కెవిపిఎస్ మండల మహాసభ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ స్ఫూర్తితో జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకై కుల వివక్షపై ప్రత్యక్షంగా ప్రతిఘటన ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా నేటికి గ్రామాల్లో, పట్టణాల్లో దళితులపైన, అణగారిన వర్గాలపైన కుల వివక్ష దాడులు, హత్యలు, ఆత్యాచారాలు కొనసాడం అత్యంత హేయనీయమని పేర్కొన్నారు. సామాజిక పోరాటాల్లో యువత రావాలని పిలుపునిచ్చారు. అనంతరం 20మందితో కెవిపిఎస్ మండల నూతన కమిటీని ఎన్నుకోగా మండల అధ్యక్ష, కార్యదర్శులుగా నెమలికంటి బాలశౌరి, సగ్గుర్తి సంజీవరావులతో పాటు మరో 18మందితో నూతన మండల కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్‌రావు, కెవిపిఎస్ జిల్లా నాయకులు కర్లకుంట నరేష్, మండల నాయకులు బెతి శ్రీనివాసరావు, మారబత్తుల రాణి, దేవకర్ణ, నంద్రు ప్రకావం, యోహాను,పోతయ్య, మల్లేశ్వరి, కోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికి ప్రమాదం




**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** రాష్ట్రంలోని ఆశవర్కర్లు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సోమవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకుని ఆశాలను అరెస్టు చేయటం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్‌రావు, రైతు సంఘం నాయకులు దివ్వెల వీరయ్య తీవ్రంగా ఖండించారు. మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం మండల ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆశాలు, అంగన్వాడీ టీచర్లు, మధ్యాహ్నభోజన కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తమ న్యాయమైన సమస్యల పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న ఆశాలను అక్రమ అరెస్టు చేయటం హేయమైన చర్యఅని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆశాల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నంద్రు సుధారాణి, అన్ని గ్రామాల ఆశాలు పాల్గొన్నారు.

# అజీజ్ వెంచర్‌కు నోటీసులు

**-అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు**
**-రికార్డుల్లో అనుమతులు ఎక్కడ..?**










**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటి పరిదిలోని 8వ వార్డులో బ్రాహ్మణపల్లి సమీపంలో ఉన్న అజీజ్ వెంచర్‌కు వైరా మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అనుమతులు లేకుండా వెంచర్ నిర్వహణలో భవన నిర్మాణాలు చేపట్ట వద్దని వెంచర్ ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు తీసుకున్నారు దానికి సంబందించిన డాక్యుమెంట్లు సమర్పించాలని మున్సిపాలిటి నుంచి ఎలాంటి అనుమతులు తీసుకున్నారు ఆ అనుమతులకు సంబందించిన డాక్యమెంటు సమర్పించాలని పేర్కొన్నారు. అనుమతులు రికార్డు పరంగా తప్పని సరిగా ఉండాలని తెలిపారు. అదేవిదంగా టిఎస్‌బిపాస్‌లో వెంచర్ నిర్వహణకు అనుమతులు తీసుకున్నారా? అనుమతులు గురించి వివరణ ఇవ్వాలని తెలిపారు. అజీజ్ వెంచర్ మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత సోమవరం గ్రామపంచాయతీ పేరుతో తప్పుడు ధృవీకరణ పత్రాలతో ఏర్పాటు చేసినారు. దానికి సంబందించిన రికార్డులు జిల్లా పంచాయతీ కార్యాలయంలోకూడా లేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అసలు అనుమతులు ఏవిధంగా పుట్టించారు. దీని వెనుక ఏమేం జరిగింది అనే విషయాలు మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి. ఇప్పటికే వైరా టౌన్ ప్లానింగ్ అధికారులు ఇటు కల భాస్కర్ మున్సిపల్ కమీషనర్‌తో అజీజ్ వెంచర్ విషయం చర్చించి దానికి సంబందించిన అనుమతులు ఇచ్చి ఉంటే ఖమ్మంలో డిపిఓ ఆఫీసులో ఉంటాయి. ఆ అనుమతులు కోసం డిపిఓకి కూడా లెటర్ పెట్టనున్నట్లు సమాచారం. ఎందుకంటే మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత వెంచర్ అనుమతి తీసుకోవాలి. దీనివలన మున్సిపాలిటికి పెద్ద ఎత్తున పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. దీనినుంచి తప్పించుకునేందుకు పంచాయతీ పేరుమీద అనుమతులు సృష్టించి పెద్ద ఎత్తున మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొట్టడం జరిగింది.

# రోటరీ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తాం

**-రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా 3150**
**తాజా మాజీ గవర్నర్ డా బుసిరెడ్డి శంకర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రోటరీ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేయగలమని, కానీ నెలల తరబడి అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగలేమని రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా 3150 తాజా మాజీ గవర్నర్ డాక్టర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నాగినేనిప్రోలురెడ్డి పాలెం గ్రామ ఊర చెరువును 30లక్షల రూపాయల రోటరీ నిధులతో మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయడానికి అనుమతి జారీ చేయమని, గత సంవత్సర కాలంపై నుండి జిల్లా కలెక్టర్‌ను అభ్యర్థించామని, ఇప్పటికీ సంవత్సరం పైగా గడిచిపోయిందన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ని కలిసి పరిస్థితి వివరించగా, వారి ఆదేశం మేరకు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారు నాగినేనిప్రోలురెడ్డిపాలెం ఊర చెరువు అభివృద్ధికి అనుమతిస్తూ లేఖ ఇచ్చారు. కానీ పొమ్మనలేక పొగ పెట్టినట్టుగా, అభివృద్ధి చేయవద్దని నేరుగా చెప్పలేక మూడు వైపులా నూతన కరకట్ట నిర్మాణం చేయవద్దని, చెరువు లోపల పూడిక తీయవద్దు అంటూ, అనేక ఆంక్షలతో కూడిన అనుమతితో లేఖ ఇచ్చారన్నారు. ఈ చెరువు అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని జిల్లా అధికారుల నుండి సత్వరమే అనుమతులు ఇప్పించాలని, ఈ చెరువు అభివృద్ధిపై ఆసక్తి ఉన్న గ్రామస్తులు కూడా జిల్లా కలెక్టర్‌ని కలిసి పరిస్థితులను వివరించి ఈ చెరువును అభివృద్ధి కోసం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసక్తి లేకపోతే మేము తలపెట్టిన ఊర చెరువు అభివృద్ధిని విరమించుకోక తప్పదని తెలిపారు.

## మార్చిలోనే మండుతున్న ఎండలు



**ప్రజాపక్షం/సుజాతనగర్:** మార్చి నెలలోనే ఎండలు మండుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలో ఎండలు ఎక్కువగా ఉంటాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉదయం 6 గంటల నుండి భానుడు భగభగ మంటున్నాడు. సాయంత్రం 6 గంటల వరకు ఎండ తో ప్రజల విలవిలాడుతున్నారు. చెరువుల్లో, వాగుల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. వరి రైతులకు నీరు అందటం లేదు. మిర్చి కూలీలు ఎర్రని ఎండని సైతం లెక్కచేయకుండా మిరపకాయలు కోతకు వెళుతున్నారు. ప్రధాన రహదారుల్లో మధ్యాహ్నం సమయంలో ఎవరు బయటకు రావడం లేదు. పళ్ళ రసాలు, కూల్ డ్రింక్స్, కొబ్బరి నీళ్లు, పుచ్చకాయల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు.

## రూ.59,584 రికవరీకి ఎస్ఆర్‌పి నివేదిక




**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు సంబంధించి ఏప్రిల్ 1 తేదీ 2023 నుండి 31 మార్చి 2024 వరకు 41 గ్రామ పంచాయితీల్లో 487 పనులకు సంబంధించి ఏడు కోట్ల 45లక్షల 39వేల 985 రూపాయల వ్యయంపై 16వ సామాజిక తనిఖీకి సంబంధించి నివేదిక అందజేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ప్రజావేదిక నిర్వహించగా డిఆర్‌డిఏ అడిషనల్ పిడి చుంచు శ్రీనివాసరావు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గతంలో పని చేసిన పంచాయితీల కార్యదర్శిలు రికార్డు ఇవ్వలేదని అధికారుల దృష్టికి సామాజిక బృందం సభ్యులు తీసుకెళ్లారు. జైత్రం తండ పంచాయితీలో 11లక్షల62వేల858 రూపాయల విలువ గల పనులు జరిగాయని, అయితే ఎవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించి 174 మొక్కలకు గాను పది రోజులు పనికి 65 రోజులు చేసినట్లు చూపించి 16,500ఎక్సెస్ అమౌంట్ చెల్లించారని ఆడిట్ సభ్యులు నివేదికలో పేర్కొన్నారు. మాదారం గ్రామ పంచాయితీలో 28లక్షల రూపాయలకు పైగా పనులు జరిగినట్లు సామాజిక బృందం సభ్యులు తెలిపారు. అయితే 59,584 రూపాయల రికవరీకి ఎస్ఆర్‌పి నివేదికను అందించారు. ఈకార్యక్రమంలో ఏపీడి శ్రీదేవి, డివిఓ సక్రియ, క్వాలిటీ కంట్రోల్ డిఈ వీరయ్య, ఎంపీడీవో జి సురేందర్, ఎంపీఓ ఎం రవీంద్ర ప్రసాద్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో బానోత్ కోటేశ్వరరావు, అజయ్‌కుమార్, పిసి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా సామగ్రి పరిశీలన



**ప్రజాపక్షం/కారేపల్లి:** జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశానుసారం ప్రతి పాఠశాలను సందర్శించి క్రీడా సామాగ్రిని పరిశీలించారు. అదే విధంగా క్రీడా సామాగ్రి రసీదు, యుసిని పరిశీలించగలరని తెలిపారు. కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి డి జయరాజు, పిఎస్ కొమ్ముగూడెం పాఠశాలను సందర్శించారు. పిఎస్ కొమ్ముగూడెం పాఠశాలను సందర్శించి క్రీడా సామాగ్రిని పరిశీలించారు. క్రీడా సామాగ్రిని పరిశీలించిన మండల విద్యాశాఖ అధికారి డి జయరాజు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో స్టాంగ్ టీచర్స్ బి శ్యామలాల్, ఎల్ లక్ష్మ ణ్, సిఆర్‌పి పి రమేష్ పాల్గొన్నారు.

## ఐటిడిఏ పివోకు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/ములకలపల్లి:** తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటిడిఏ భద్రాచలం పీవోని కలిసి పోడు పట్టాలు ఉన్నటువంటి భూములకు కరెంటు లైన్లు, బోర్లు గతంలో సంఘం ఆధ్వర్యంలో దరఖాస్తు చేశారు. ఈ జిల్లాలో ఉన్నటువంటి పోడు భూములన్నిటికీ అటవీ శాఖ నుండి ఎటువంటి అభ్యంతరాలు లేకుండా విద్యుత్ లైనులకు పర్మిషన్ ఆర్డర్ ఇచ్చారు. ఈ మంజూరు ఆర్డర్ ఈ సోమవారం ఇచ్చినటువంటి భద్రాచలం ఐటిడిఏ పీవో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నుండి కృతజ్ఞతలు తెలిపారు. పివో రాహుల్ వచ్చిన తర్వాత ఆదివాసులకు ఐటిడిఏ ద్వారా ఆదివాసులకు లబ్ది చేకూరుతున్నదని, అదే విధంగా పోడు భూమికి బోర్లు వేసి అభివృద్ధికి కృషి చేయాలని సంఘం కోరారు. ఈకార్యక్రమంలో తెలంగాణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు గౌరీ నాగేశ్వరరావు, సంఘం జిల్లా కమిటీ సభ్యులు సోడే ప్రసాద్, వర్స శ్రీరాములు, గౌరీ లక్ష్మి , రావుల నాగేంద్రబాబు, సోమని కృష్ణ, రుద్రం శ్రీను, గౌరీ వెంకటేశ్వర్లు, గణప వెంకటేశ్వర్లు, ఘనప ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లపై అక్రమ కేసులను ఎత్తివేయాలి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఈ నెల 24వ తేదీన ఆశ వర్కర్ల అసెంబ్లీ ముట్టడిలో భాగంగా హైదరాబాద్‌లో ఆశా వర్కర్లను ఇబ్బందులు గురి చేస్తూ అరెస్టు చేసి కేసులు పెట్టిన విధానాన్ని సిఐటియు ఆశా వర్కర్ల యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో జూలూరుపాడు ప్రభుత్వ హాస్పటల్ దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు వి. చందర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆశ వర్కర్లకు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చకుండా వారిని అనేకమైన ఇబ్బందులు గురిచేస్తూ అవమానపరుస్తూ ఆర్థిక ఇబ్బందులు గురిచేస్తుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు పూణెం ఝాన్సీ, జూలూరుపాడు మండల అధ్యక్షురాలు నీలిమ, మండల నాయకులు దివిలి, సిఐటియు నాయకులు బొల్లి లక్ష్మ య్య, శారద వసుంధర, యేసు మణి, కళ్యాణి, వెంకట్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సరిహద్దులు దాటిన అభిమానం

**ఇండియా గేట్ వద్ద ఎంఎల్ఏ దంపతుల చిత్రాల పదర్శన**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అభిమానానికి హద్దులు లేవని నిరూపించారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ దంపతుల అభిమానులు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆదివారం ఢిల్లీ వెళ్లిన సత్తుపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు తమ్మిశెట్టి గణేష్ బాబు, అలకుంట నరసింహారావు, పరిమి భారత్ లు మంగళవారం వాళ్ళ అభిమాన నాయకులు ఎం.ఎల్.ఏ డా. మట్టా రాగమయి దయనంద్ మీద అభిమానాన్ని ఇండియా గెట్ వద్ద వారి చిత్రాలను పదర్శించి చాటుకున్నారు.

## ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య డిమాండ్ చేశారు.సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాసమస్యలపై ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కంద్రిక గ్రామంలో ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఫెన్షన్లు, రైతు భరోసా, పంటరుణాలు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మద్దా ప్రభాకర్‌రావు, మండల కమిటీ సభ్యులు ఆంగోతు వెంకటేశ్వర్లు, రాజు, నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట కార్యాచరణ

-సన్న, దొడ్డురకం ధాన్యాలకు వేర్వేరు కేంద్రాలు
-కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన
-ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో కలెక్టర్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** యాసంగి మార్కెటింగ్ సీజన్‌లో ఖమ్మంజిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా పటిష్ట కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ఖమ్మం జిల్లాలో విజయవంతంగా జరిగిందని అభినందించారు. రైతు కోసం పనిచేస్తున్నామనే అంశాన్ని ప్రతి ఒక్కరు జ్ఞాపకం పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతు పండించిన వరి పంట విస్తీర్ణం, పంట కోతల సమయం, కొనుగోలు కేంద్రాలకు ఎప్పుడు పంట తీసుకు వస్తారనే అంశం వ్యవసాయ శాఖ ప్రణాళికాబద్ధంగా షెడ్యూల్ చేయాలన్నారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం అంచనా ప్రకారం అవసరమైన వేయింగ్, తేమ యంత్రాలు, ప్యాడీ క్లినర్, టార్పాలిన్, గన్నీ సంచులు మొదలైన మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. వేయింగ్, తేమ యంత్రాల పనితీరును చెక్‌చేసి సర్టిపై చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద త్రాగునీరు, విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా చల్లని త్రాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వడదెబ్బ తగిలితే ప్రాథమిక చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులు పండించిన సన్న రకం ధాన్యాన్ని వ్యవసాయ విస్తరణ అధికారులు సర్టిఫై చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో తేమ యంత్రాలు అందుబాటులో ఉంచి, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్న బస్తాల వివరాలను ఎప్పటికప్పుడు నోటీసుబోర్డులో నమోదు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత వెంటనే వివరాలను ట్యాప్ ఎంట్రీ చేసేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రం ఇంచార్జిలకు నూతన సిమ్ కార్డులను అందించి డేటా ఎంట్రీ సత్వరమే జరిగేలా చూడాలని రైతులకు 48 గంటల వ్యవధిలో నగదు జమ అయ్యేలా చూడాలన్నారు. రైసు మిల్లుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాళ్లు కట్ చేయడానికి వీలులేదని నాణ్యతను కొనుగోలు కేంద్రాల వద్దే పరిశీలించి పంపాలన్నారు. హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ఒకేసారి జరుగుతున్న నేపథ్యంలో రవాణా వాహనాలకు ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైసు మిల్లులకు తరలించేలా చూడాలని, సరిహద్దు ప్రాంతాల్లో, ఇతర రాష్ట్రాల నుంచి సన్న రకం ధాన్యం రాకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా కనీస మద్దతు ధరలు తెలిపే కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, జిల్లా సహకార అధికారి గంగాధర్, ప్రత్యేకాధికారులు, సెంటర్ ఇంచార్జిలు, ఐకెపి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి రైతులను కేంద్రం ఆదుకోవాలి

-లోక్‌సభలో ఎంపి రామసహాయం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మిర్చి రైతులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభలో కోరారు. మంగళవారం లోక్‌సభలో 377 నిబంధన క్రింద మిర్చి రైతుల పక్షాన ఎంపి రామసహాయం పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో మిర్చి అధికంగా సాగవుతుందని, రైతులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని ఎంపి కోరారు. దేశంలో మిర్చి ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం అగ్రభాగాన ఉందన్నారు. గతేడాది 12.43 లక్షల హెక్టార్లలో మిర్చి సాగు చేయగా 48.29 లక్షల టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. తెల్లదోమ, విల్ట్, ఆకుముడత వంటి తెగుళ్లతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం అధిక ఖర్చులతో ఆర్థికంగా దెబ్బతింటున్నారని ఎంపి ప్రస్తావించారు. మార్కెట్ హెచ్చుతగ్గులు, మధ్యవర్తుల దోపిడీతో రైతులు నష్ట పోతున్నారని ఆయన తెలిపారు. వర్షాభావం, నీటి సదుపాయం, కల్తీ విత్తనాలు, కూలీల కొరత, అధిక వ్యయంతో రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి చీడ, పీడల నియంత్రణ చర్యలు చేపట్టాలని, సబ్సిడీలు, మద్దతు ధర కల్పించాలని, తక్కువ వడ్డీకి రుణాలు అందించి మిర్చి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎంపి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ఐఎన్‌టియుసిలో యువతకు ప్రాధాన్యం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఐ.ఎన్.టి.యూ.సిలో యువతకు ప్రాధాన్యతనివ్వటం ద్వారా రానున్న రోజులలో యూనియన్ బలోపేతంతో పాటు యూనియన్ ని నమ్ముకున్న వారికి అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవచ్చన్నారు యూనియన్ వైస్ ప్రెసిడెంట్ రజాక్. జే.వి.ఆర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో ఐ.ఎన్.టీ.యూ.సి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాలతో, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఐ.ఎన్.టి.యూ.సీ నూతన కమిటీలలో యువతకు ప్రాధాన్యమిస్తూ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తున్నటువంటి కార్యకర్తలకు నియామక పత్రాలు మంగళవారం అందజేశారు. అనంతరం రజాక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐ.ఎన్.టి.యూ.సి యూనియన్ ద్వారా మాత్రమే సింగరేణి భవిష్యత్తు ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయ సహకారాలతో, జనక్ ప్రసాద్ నాయకత్వంలో సింగరేణిలో నూతనంగా బొగ్గు బావులు సాధిస్తామని, సింగరేణి కార్మికుల చిరకాల కోరికైనటువంటి సొంత ఇంటి కల నెరవేర్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. నూతనంగా కమిటీలో మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ కాజా మొయినుద్దీన్, ఓల్డ్ సి.హెచ్.పి ఇంచార్జ్ చంద్రమౌళి, మైన్స్ కమిటీలో సభ్యునిగా దావూద్ అలీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జనగామ శ్రీనివాస్, నాగేంద్రరావు తదితరులు సభ్యత్వాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్, జాయింట్ సెక్రెటరీ నాగ ప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కాసర్ల సమ్మయ్య, సెంట్రల్ కమిటీ నాయకులు సకినాల సమ్మయ్య, రామారావు (ఫిట్ సెక్రెటరీ, జె.వి.ఆర్ ఓసి), బాలాజీ (ఫిట్ సెక్రటరీ, కిష్టారం ఓసి), నాగేశ్వరరావు (ఫిట్ సెక్రటరీ, జె.వి.ఆర్ సి.హెచ్.పి), జే.వి.ఆర్ ఓసి అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు కోటి, సురేష్, ఐ వి రెడ్డి, రామచందర్, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మించండి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ప్రభుత్వాలు మారుతున్నాయి పాలకులు మారుతున్నారు కానీ దళిత జాతి అభివృద్ధి మాత్రం జరగటం లేదు పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం మండలంలో దళితుల ఓటు బ్యాంక్ అధికంగా ఉంటుందని మాట జన సమితి పినపాక నియోజకవర్గ అధ్యక్షులు చెట్టి సురేష్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి, వర్థంతి వేడుకలు, దళిత జాతి అభివృద్ధి కోసం దళిత జాతిని ఐక్యం చేయడం కోసం సమావేశాలు నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీని కోసం అశ్వాపురం మండలంలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మించండి మహా ప్రభో అని పలు మార్లు దళిత సంఘాల ఆధ్వర్యంలో తాజా మాజీ ఎమ్మెల్యేలతో పాటు సంబంధిత మండల అధికారులు కూడా దరఖాస్తులు విన్నవించుకుంటు వస్తున్నాయని అన్నారు. అప్పటికప్పుడు మొక్కుబడిగా మాట ఇస్తున్నారే తప్ప దానిని కార్యరూపం దాల్చుటలేదన్నారు. ఇప్పటికైనా పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు చొరవ చూపి సంబంధిత అధికారులతో మాట్లాడి అశ్వాపురం మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని అన్నారు. ఈకార్యక్రమంలో జూపల్లి ధ్రువకుమార్, చెట్టి ఎనోష్, ఉండేటి రాజేష్, శెట్టి కుమారి, జూపల్లి సుశీల, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను అరికట్టాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను అరికట్టాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంద మండల కార్యదర్శి గోగ్గల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ స్థలాలు రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నారని, ఊరును ఆనుకొని ఉన్న లక్ష్మీ నరసమ్మ కుంట శిఖం భూమి, డబుల్ బెడ్ రూమ్ కాలనీ ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాలు, ఆక్రమణలకు గురవుతున్న అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. ఆళ్లపల్లి సెంటర్‌లో రోడ్డు ఆక్రమణ వివాదం చిలికిచిలికి జటిలమై రకరకాల చర్చలకు వివాదాలకు దారి తీస్తుందన్నారు. రోడ్డు వివాదంతో పాటు ప్రభుత్వ స్థలాలు అక్రమణాల అన్నింటిపై అధికారులు వెంటనే విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆక్రమణదారులు ఆక్రమించిన భూమిలో నిర్మాణాలు చేపట్టిన తర్వాత తొలగించడం వివాదాలకు దారి తీస్తుందని, కాబట్టి ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు జోగసారన్న, ఈసం సమ్మయ్యలు పాల్గొన్నారు.

# ఏటీసీ నిర్మాణ పనులు పరిశీలించిన ఆర్‌డిడి



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఏటిసి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదే శించారు. నిర్మాణంలో సరైన నా ణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఏ టి సి నిర్మాణ పనుల విషయాలను గురించి సంబంధిత కాంట్రాక్టర్ అధికారులతో మాట్లాడారు. అన్ని విభాగాలకు సంబంధించి నిర్మాణ పనులు వేదవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ ప్రాంత విద్యార్థులకు ఏటిసి మరింత ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆధునిక సాంకేతిక విద్యా విధానంతో నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఐటిఓ జి.రవి, సూపరింటెండెంట్ టిఎన్ జ్యోతి రాణి, వీటివోలు జివి కృష్ణారావు, ఎం శ్రీనివాసరావు, నరసయ్య, వేణుగోపాల్, ఏటీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

## మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఏడుగురు స్పెషలిస్ట్ వైద్యుల నియామకం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి మరో కొత్త శోభను తీసుకువచ్చే విధంగా పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్ల చొరవతో 7 మంది నూతన స్పెషలిస్ట్ వైద్యులను ప్రభుత్వం నియమించడం మణుగూరు ప్రజలకు శుభపరిణామం. గతంలో ఉన్న 6 మంది వైద్యులతో పాటు ఇప్పుడు మొత్తం 13 మంది వైద్యులు అందుబాటులో ఉండటంతో వైద్యసేవలు మరింత మెరుగుపడనున్నాయి. మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నియమించబడిన గైనకాలజిస్ట్ 2,అనస్థీషియాలజిస్ట్ 2, పిల్లల వైద్యుడు 1, జనరల్ ఫిజీషియన్ 1, స్కానింగ్ వైద్యుడు 1 కాగా, గతంలో ఉన్న వైద్యులు 6 ఎం.బి.బి.ఎస్ వైద్యులు 5, డెంటల్ వైద్యుడు 1 మొత్తం వైద్యులు : 13 ఉన్నారు. మణుగూరు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రి మరింత బలోపేతంగా ఉంది.

# మున్సిపాలిటీలో అధికారుల ఇష్టారాజ్యం

**-ఎప్పుడైనా రావచ్చు.. నచ్చినప్పుడు పోవచ్చు...**
**-వారిని కాపాడుతున్న మరో అధికారి**




**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీలో కొంతమంది అధికారులు వారి ఇష్టానుసారంగా విధి నిర్వహణలో వారికి నచ్చినట్లు పాల్గొంటున్నారు. ఆ అధికారులకు సమయంతో పనిలేదు. ఎప్పుడైనా రావచ్చు నచ్చినప్పుడు పోవచ్చు అనేది వారి సిద్ధాంతం. వేల రూపాయలు ప్రభుత్వం జీతం తీసుకుంటు విధి నిర్వహణకు రావలసిన సమయానికి రాకుండా వారికి ఎప్పుడు నచ్చితే అప్పుడు రావడం వైరా మున్సిపాలిటీలో కొంతమంది అదికారులకు ఒక అలవాటుగా మారింది. మున్సిపాలిటీలో ఓ అధికారి తన సామాజిక వర్గానికి చెందిన అధికారిని కాపాడుకోవడం జరుగుతుంది. కీలకమైన ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే ఓ అదికారి తనకు సమయపాలనతో పనిలేదు. ఆఇష్టం ఎప్పుడైనా వస్తా ఎప్పుడైనా పోతా అనేది అతని సిద్ధాంతం. ఆ అధికారిని మరో అదికారి కాపాడటం కొస మెరుపు ఏమటనుకుంటున్నారా ఆ అధికారి విధి నిర్వహణకు రానప్పుడు మున్సిపాలిటీలో ఉన్న మరో అధికారి సిఎల్ పేరుతో లెటర్ పెడతాడు. తర్వాత ఆలెటర్‌ను కనపడకుండా చేస్తాడు. ఎవరైన అధికారులు వస్తే ఆసమయంలో సిఎల్ లెటర్ చూపిస్తాడు. రాకపోతే ఆలెటర్‌ను కనపడకుండా చేస్తాడు. కీలకమైన అకౌంటింగ్ విభాగంలో సుమారు సంవత్సరకాలంపాటు ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే వ్యక్తికి బాద్యతలు అప్పజెప్పారు. ప్రస్తుతం అకౌంటింగ్‌నుంచి బాద్యతను తొలగించారు. అయితే సంవత్సరకాలంగా జరిగిన వ్యవహారాల్లో అధికారి చేతివాటం భారీగా ప్రదర్శించాడనే వాదనలు వినిపిస్తున్నాయి. డ్యూటీలో కొద్దిసేపు ఉండి వెళ్లిపోతాడు. దీనిని పట్టించుకోవాల్సిన బాద్యత ఎవరిది. గతంలో కూడా అధికారులు విధులకు హాజరు కాకుండా రిజిస్టర్‌లో సంతకాలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా వైరా మున్సిపాలిటీలో అధికారులు విధినిర్వహణలో సమయపాలన పాటించాలని దీనిపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని పూర్తి స్థాయిలో విచారణ చేపడితే అధికారులు బాగోతం బయటపడుతుంది.

# ప్రజా సమస్యల పరిష్కారమే బిజెపి లక్ష్యం

**-ఆరు హామీలు అమలు చేసేంత వరకు పోరాటం**
**-మీడియా చిట్‌చాట్‌లో బిజెపి అధ్యక్షులు నెల్లూరి**





**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజా సమస్యల పరిష్కారమే బిజెపి ప్రధాన లక్ష్యమని అందుకు అనుగుణంగా కార్యాచరణ చేపడతామని బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిపై సరైన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రతి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ఉందని కాంగ్రెస్ ఆ బాధ్యతను విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు కోసం బిజెపి పోరాడుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక మంది రైతులు రుణమాఫీ కాక ఇబ్బందులు పడుతున్నారని రెండు లక్షల పైన కూడా రుణ మాఫీ చేస్తామని చెప్పటం ఇప్పుడు మాట తప్పటం కాంగ్రెస్‌కే చెల్లిందన్నారు. జిల్లాలో మూడు లక్షల మందికి రుణమాఫీ జరగాల్సి ఉండగా కేవలం రెండు లక్షల మందికే రుణమాఫీ జరిగిందని కోటేశ్వరరావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిజెపి పోరాడుతుందని భవిష్యత్తులో ప్రజా సమస్యలు ఎక్కడుంటే అక్కడ బిజెపి పోరాటముంటుందన్నారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# త్రీటౌన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించండి

**-వేసవిని దృష్టిలో ఉంచుకుని**
**మంచినీటి సరఫరా పై దృష్టిసారించాలి**
**: సిపిఐ నేత సలాం**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం త్రీటౌన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. చాలా కాలంగా త్రీటౌన్ ప్రాంతంపై వివక్ష కొనసాగుతుందని ఆయన ఆరోపించారు. సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం భూక్యా రవీందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశలో సలాం మాట్లాడుతూ త్రీటౌన్ ప్రాంతంలో పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివసిస్తున్నారని రక రకాల కారణాలతో నిధుల కేటాయింపులో వివక్ష జరుగుతుందన్నారు. వ్యాపారపరంగా ఒకప్పుడు భాసిల్లిన త్రీటౌన్ ప్రాంతంలో సరైన వసతుల కల్పన లేదని ఖమ్మం గ్రెయిన్ మార్కెట్ కారణంగా వ్యవసాయోత్పత్తులకు వచ్చే రైతులు ట్రాఫిక్ అంతరాయంతో ఇబ్బందులు పడుతున్నారని సలాం ఆరోపించారు. మిర్చి ఘాటు నుంచి ఉపశమనం కలిగేందుకు ట్రాఫిక్‌ను మళ్లించాలని ఆయన సూచించారు. హిందు స్మశానవాటిక నుంచి నేరుగా గ్రెయిన్ మార్కెట్ వరకు లింక్ రోడ్డును నిర్మించాలని సలాం డిమాండ్ చేశారు. సిపిఐ పోరాట ఫలితంగానే మధ్యగేటు పునః ప్రారంభమైందని సలాం తెలిపారు. నాలుగు నెలలుగా మూతపడిన మధ్యగేటును తెరిపించడంలో సిపిఐ పోరాటం కీలకమైందన్నారు. ఈ సమావేశంలో త్రీటౌన్ కార్యదర్శి నూనె శశిధర్, సిపిఐ నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, కృష్ణయ్య, బి. సత్యనారాయణ, బాలకృష్ణ, నామ విజయ్‌కుమార్, చిర్రా వెంకన్న, ఉడత అశోక్, వి. లింగయ్య, సురేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాది హత్యకు నిరసనగా విధుల బహిష్కరణ

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** హైదరాబాద్ నగరంలో న్యాయవాది ఇజ్రాయిల్‌ను దారుణంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఖమ్మం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఐఎఎల్, ఐలు, తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల లీగల్ సెల్, నోటరీ న్యాయవాదుల సంఘం ఈ హత్యను తీవ్రంగా ఖండించాయి. ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకు రావాలని వారు డిమాండ్ చేశారు.

# బకాయిల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఉద్యోగుల ఆరోగ్య భద్రత, పెండింగ్ పిఆర్‌సి, పెండింగ్ డిఏలు, పెడింగ్ బకాయిల సాధన కోసం ఐఖ్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జేఏసి జిల్లా చైర్మన్ అమరనేని రామారావు, కన్వీనర్ వెంకటపుల్లయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక పెన్షనర్ల భవనంలో రాష్ట్ర ప్రభుత్వ గెజిటెడ్ అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయ, కార్మిక, ఫెన్షనర్ల జేఏసి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముందుగా జేఏసి చైర్మన్‌గా అమరనేని రామారావు, కన్వీనర్‌గా వెంకటపుల్లయను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఐఖ్య ఉద్యమాలే శరణ్యం అన్నారు. ఇందు కోసం జేఏసిలోని ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గేజిటెడ్ అధికారులు, ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అండగా ఉంటాం : వనమా

**ప్రజాపక్షం/భద్రాచలం :** జర్నలిస్టుల న్యాయమైన కోర్కెను ప్రభుత్వం నెరవేర్చాలని, ఇండ్ల స్థలాలు ఇచ్చేంత వరకు అండగా ఉంటామని కొత్తగూడెం మాజీ ఎంఎల్‌ఏ వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు దీక్షా శిబిరానికి చేరుకున్న వనమా సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, బిజేపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఎర్ర కామేష్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ నామాత్రపు రేట్లకు కార్పోరేట్ సంస్థలకు ఎకరాలకు ఎకరాలు అప్పగిస్తున్న ప్రభుత్వం సంక్షేమ కోసం, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేసే జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# తగిన న్యాయం చేయండి

**- రామాలయ పరిసర వ్యాపారులు**

**ప్రజాపక్షం/భద్రాచలం :** రామాలయం మాఢవీధుల విస్తరణలో భాగంగా దుకాణాలు నిర్వహిస్తున్న తాము జీవనోపాధి కోలోతున్నామని, అందుకు తగిన న్యాయం చేయాలని కోరుతూ వ్యాపారులు మంగళవారం ఆర్‌డిఓకు వినతి పత్రం సమర్పించారు. దశాబ్దాల కాలంగా రామాలయ పరిసర ప్రాంతాల్లో దుకాణాలు నిర్వహిస్తూ పొట్టపోసుకుంటున్నామని, ఇక్కడ వ్యాపారం చేసుకుంటేనే జీవనం సాగుతుందని అన్నారు. ఇప్పుడు మాఢవీధుల పేరుతో విస్తరణ చేస్తే తమ బ్రతుకులు రోడ్డున పడతాయని, దీనిని ప్రభుత్వం, అధికారులు గమనించి తగిన న్యాయం చేయాలని కోరారు.

# ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచాలి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఉపాధి హామీ పథకం పనులల్లో కూలీల సంఖ్యను పెంచాలని జిల్లా పంచాయితీ అధికారి చంద్రమౌళి మండల అధికారులను ఆదేశించారు. మంగళవారం తుంగారం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో రైతులు తమ పంట చేనుల్లో, వ్యవసాయ బోరుబావుల వద్ద ఫారం పౌండ్స్‌ను నిర్మించుకోవాలన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. కూలీలు పని చేసే దగ్గర నీడ, మంచినీటిని ఏర్పాటు చేయాలన్నారు. వారం వారం కొలతలు తీయాలన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై జిపి సెక్రటరీలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట ఎంపీవో ఖాన్, టిఏ రాము, జిపి సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

# కార్మికుల పని స్థలాలలో సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఏరియాలో పనిచేసే స్థలాలలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పేర్కొన్నారు. ఏరియా జీఎం కార్యాలయంలో మంగళవారం ఏరియా జీఎం వి.కృష్ణయ్య అధ్యక్షతన గుర్తింపు సంఘం, సింగరేణి యాజమాన్యం మధ్య ఏర్పాటైన నెలవారీ సమావేశంలో హాజరై మాట్లాడారు. ఏరియాలో పనిచేస్తున్న కార్మికుల పనిస్థలాలలో ఎదుర్కొనే సమస్యలు, విన్నపాలు గురించి పలు సమస్యలను ఏరియా జీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఏరియా జీఎం స్పందించి సాధ్యమైనంత వరకు ప్రతీ సమస్యను పరిష్కార దిశకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఓటూ జీఎం రామస్వామి, పీఓకేఓసీ గోవిందరావు, జేకే ప్రాజెక్టు అధికారి ఎ.కృష్ణ మోహన్, గుర్తింపు సంఘం తరపున వైస్ ప్రెసిడెంట్ రాజారాం, శాఖ కార్యదర్శి నజీర్ అహ్మద్, రమేశ్, శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

# భద్రాద్రికి కొత్త శోభ

**-టెంపుల్ సిటీగా రామాలయం**
**-భూసేకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్**
**-మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో రూ. 34 కోట్లు విడుదల**
**-ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాముడు నడయాడిన, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రామాలయానికి నూతన శోభ సంతరించుకోనుంది. శ్రీరామ నవమి సీతారామ కళ్యాణ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భద్రాద్రి రామాలయాన్ని అభివృద్ధి చేసి టెంపుల్ సిటీగా మార్చేందుకు పూనుకుంది. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న భూ సేకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భద్రాద్రి ఆలయ అభివృద్ధికి సంబంధించి భూ సేకరణ సమస్యను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. యుద్ధ ప్రాతిపదికన భూ సేకరణ జరిపేలా చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశానుసారం భూసేకరణకు సంబంధించి రూ. 34 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. దీనితో శ్రీరామ నవమికి దక్షిణ అయోధ్య టెంపుల్ సిటీకి అడుగులు పడనున్నాయి. ఇటీవల ఆలయ ఈవో, పండితులు ముఖ్యమంత్రిని కలిసి భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి కళ్యాణ వేడుకలకు ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో భద్రాద్రి ఆలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రికి వివరించారు. అభివృద్ధి పనులకు భూ సేకరణ అడ్డంకిగా మారిందని మంత్రి తుమ్మల సిఎంకు వివరించారు. భూసేకరణ పనులు పూర్తి చేస్తే భద్రాచల ఆలయ అభివృద్ధికి ఎలాంటి ఆటంకం ఉండదని టెంపుల్ సిటీగా భక్తులతో మరింత శోభిల్లుతుందని మంత్రి తుమ్మల తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూసేకరణకు కావాల్సిన నిధులను విడుదల చేశారు. అడిగిందే తడవుగా నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయం నూతన శోభను సంతరించుకోనుంది. ఆగమ పండితులు రూపొందించిన నమూనాలు, సూచనల ప్రకారం అభివృద్ధి పనులు ప్రారంభించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. భూసేకరణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని సూచించారు. యుద్ధ ప్రాతిపదికన షాపులు, ఇండ్లు, షిఫ్టింగ్ చేయాలన్నారు. శ్రీరామ నవమి వేడుకల అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా భద్రాద్రి ఆలయ పునః నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. భద్రాద్రి ఆలయాన్ని టెంపుల్ సిటీగా మార్చాలన్న రాష్ట్ర ప్రజల కల సాకారం కానుంది.

# పలుగు, పార పట్టిన కలెక్టర్

**- కూలీగా మారిన కలెక్టర్**
**- ఉపాధి పనులను వందరోజులు పూర్తి చేసుకోవాలి**
**- రైతులు ఫారంఫాండ్‌లు ఏర్పాటు చేసుకోండి**





**ప్రజాపక్షం/భద్రాచలం :** పరిపాలన చేయడమే కాదూ.... పలుగు పార పట్టడం కూడా ఆయనకు తెలుసు. కూలీలతో కలిసి సుమారు 45 నిమిషాల పాటు కూలీగా మారాయి, ఆయనే ఐఎస్ఎస్ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్. చలిమర గదులు, ఖరీదైన ఏసి వాహనాల్లో తిరగడమే కాదు మండుటెండలో సైతం లెక్కచేయకుండా మంగళవారం మండల పరిధిలోని బోడు గ్రామపంచాయితీలో ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న ఉపాధి హామీ పనులను నెలాఖరు నాటికి పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో కూలీలను ప్రోత్సహించేందుకు జిల్లా ఆయన కూలీగా మారిపోయారు. దీంతో పని ప్రదేశంలో ఉన్న వారంతా కలెక్టర్‌తో పాటు ఉత్సాహంగా నడుం వంచ్చారు. అనంతరం ప్రక్కనే ఉన్న రహదారి పనులను పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ కుటుంబం 100 రోజుల ఉపాధి పని దినాలు సద్వినియోగం చేసుకోవాలని, వేసివ అధికంగా ఉన్నందున ఉదయాన్నే పనులు మొదలుపెట్టాలన్నారు. నీటి యద్దడిని నివారించేందుకు రైతులు ఫఆరం ఫాండ్‌లు నిర్మాణాలు చేపట్టాలని, ఎక్కువ ఆదాయం వచ్చే మునగ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతులు సాగుచేస్తున్న 6 ఎకరాల మునగ సాగును పరిశీలించారు. ఎర్రాయిగూడెంలో గ్రామపంచాయితీలో నిర్మించిన పశువుల షెడ్లను పరిశీలించిన ఆయన సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున కూలీలు పాల్గొనేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని, పని ప్రదేశంలో సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఎంపిడిఓ జి రవీంధర్, గాంధీ, ఏఓ అన్నపూర్ణ, ఏపిఓ శ్రీనివాస్, ఈసి తిరుపతయ్య, టిఏ ఈశ్వరి, ఎఫ్ఏలు, కార్యదర్శులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఊపందుకున్న శ్రీరామనవమి పనులు




**- స్వాగత ద్వారాలు ఏర్పాటు**
**- 30 నుండి తిరు కళ్యాణ మహోత్సవాలు**
**- 6న శ్రీరామ నవమి, 7న పట్టాభిషేకం**
**- భక్తుల కోసం సకల సదుపాయాలు**




**ప్రజాపక్షం/భద్రాచలం :** దక్షిణ ఆయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచల శ్రీసీతారామ చంద్ర స్వామివారి శ్రీరామ నవమి పనులు ఊపందుకున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే పట్టణంలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌తో పాటు కూనవరం రోడ్, చర్లరోడ్, కరకట్ట రోడ్‌లలో ఈ ద్వారాలు భక్తులను ఆహ్వానించనున్నాయి. నవమి పనుల్లో భాగంగా సుమారు రూ.1 కోటి అంచనాలతో పలు రకాల పనులు కొనసాగుతున్నాయి.

**30నుండి తిరు కళ్యాణ మహోత్సవాలు...**

శ్రీరామ నవమిని పురస్కరించుకుని భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో వసంత పక్ష తిరుకళ్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. విశ్వావసు నామ సం. ఉగాదిని రోజున ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. అనంతరం ఉగాదిపచ్చడి పంపిణీ చేసి పంచాంగ శ్రవణం వినిపిస్తారు. ఆ తర్వాత వరుసగా సార్వభౌమసేవ, గరుధ్వజ పతన లేఖనం, అగ్నిప్రతిష్ట, ధ్వజారోహణం, హనుమాన్ సేవ, గరుడ వాహన సేవ, ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు.

**6న రాములల పెళ్లి...**

ఏప్రిల్ 6 తేది నుండి మిథిలా స్టేడియంలో రాములవారికి కన్నులపండువగా శ్రీ సీతారాముల పెళ్లి వేడుకను నిర్వహిస్తారు. ఉదయం 10.30 గం.లకు సాంప్రదాయబద్ధంగా మొదలయ్యే రాములవారి పెళ్లి 12.30 గం.లకు ముగిస్తుంది. ఈ సందర్భంగా శ్రీరామ పనర్వసు దీక్షలను ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రాచలంలో జరిగే అతి పెద్ద ఉత్సవం కావడంతో భక్తుల రాక, వేసవిని దృష్టిలో పెట్టుకుని సకల సదుపాయాలు కల్పించాలని ఇప్పటికే మంత్రి పొంగులేటితో పాటు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరుకి కృషి జరుగుతోంది..

**- సంఘాలకు అతీతంగా అర్హులైన వారికి న్యాయం చేస్తాం**
**- సాంకేతిక సమస్యలు అధిగమించేందుకు రాష్ట్ర పెద్దలను కలుద్దాం**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/భద్రాచలం :** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరీకి స్థానిక ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ఇండ్ల స్థలాలను మంజూరీ చేయాలని కోరుతూ పాత కలెక్టరేట్ కార్యాయం సమీపంలో జర్నలిస్టులు చేపట్టిన వంటా వార్పు నిరసన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ జర్నలిస్టుగా పనిచేసిన కూనంనేనికి జర్నలిస్టుల ఇబ్బందులు ఏంటో తెలుసని, గతంలో ఎంఎల్ఏగా ఉన్నప్పుడు కూడా ఇండ్ల స్థలాలు కేటాయించారని చెప్పారు. సంఘాలతు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్క జర్నలిస్టుకు ఇంటి స్థలం మంజూరయ్యేలా చూస్తామని, ఇప్పటికే స్థలాన్ని గుర్తించడం జరిగిందన్నారు. స్థలాల కేటాయింపులో సాంకేతిక సమస్య ఉంటే ప్రతినిధి బృంధంగా కూనంనేని నేతృత్వంలో రాష్ట్ర పెద్దలను కలిసి పరిష్కరించుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి మురళీ, కంచర్ల జమలయ్య, గెద్దాడి నగేష్, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, పట్టణ నాయకులు మాచర్ల శ్రీనివాస్, కె ధర్మరాజు, యూసఫ్, నేరెళ్ల శ్రీనివాస్, బోయిన విజయ్, పి సత్యనారాయణ, దుర్గ, సియాద్రి నాగేశ్వరరావు, అజీజ్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# పిండిప్రోలు సంతకు భలే డిమాండ్

**-రూ.30.30 లక్షలు**





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** పిండిప్రోలు సంతకు ఎన్నడు లేనంత డిమాండ్ పలికింది. వేలం పాటలో 90 మంది రూ. 50వేల చొప్పున డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారంటే పిండిప్రోలు సంతకు ఎంత గిరాకి ఉందో అవగతమవుతుంది. తిరుమలాయపాలెం మండలం వారంతపు సంతలో క్రయ, విక్రయాలు బాగా జరుగుతాయని పేరుంది. మాజీ సర్పంచ్ కీర్తి శేషులు రాయల నాగేశ్వరరావు 30 ఏళ్ల క్రితం పిండిప్రోలు సంతను ప్రారంభించారు. అది దిన దినప్రవర్ధమానమై ఇప్పుడుజిల్లాలోనే ఒక ప్రముఖ సంతగా పేరొందింది. ప్రతి శనివారం సంతలో కూరగాయలు, నిత్యావసర వస్తువుల మొదలు పశువులు, జీవాల అమ్మకం సాగుతుంది. 2023లో రూ. 21 లక్షలు పలికిన సంత గతేడాది అధికారులు కుమ్మకై సంత వేలాన్ని కేవలం రూ. 14 లక్షలకు తీసుకువచ్చారు. ఈ ఏడాది పంచాయతీ కార్యదర్శి రాము, ఎంపిడివో సిలార్ సాహెబ్ నేతృత్వంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. బహిరంగ వేలంలో 90 మంది పాల్గొనగా వరంగల్ జిల్లా నర్సంపేట నగరానికి చెందిన అప్పాల సుదర్శన్ రూ. 30.30 లక్షలకు సంతను కైవసం చేసుకున్నారు. ప్రశాంతంగా బహిరంగ వేలం నిర్వహించారు.

# సిపిఐ 51వ డివిజన్ కార్యదర్శిగా జాలా



**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ 51వ డివిజన్ కార్యదర్శిగా జాలా నర్సింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సిపిఐ మహాసభలో ఆయన ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో డివిజన్‌లోని సమస్యల పరిష్కారం కోసం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సిపిఐ నగర అభివృద్ధి కోసం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. కార్యదర్శిగా ఎన్నికైన నర్సింహారావును పలువురు అభినందించారు.

# సిపిఐ 58వ డివిజన్ కార్యదర్శిగా బోడ రమేష్



**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ 58వ డివిజన్ కార్యదర్శిగా బోడ రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో డివిజన్ కార్యదర్శిగా రమేష్‌ను ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శిగా భూక్యా రామకృష్ణ తో పాటు 11 మందితో 58వ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు డివిజన్ సమస్యల పరిష్కారం కోసం కార్యక్రమాలు చేపడతామన్నారు.